టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
GST IN - 36FDKPS 1308PZX
అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్
- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్
tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy, Youtube Channel, Facebook, Instagram, Twitter
ప్రెస్‌మీట్ ఏర్పాటు, ప్రెస్‌నోట్లు తయారీ, ప్రత్యేక దిన పత్రిక డిజిటల్ ఎడిషన్‌లు కోసం
దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :
8919710365 కు కాల్ చేయండి

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 09
సంచిక : 70
పేజీలు : 3
శుక్రవారం 10 అక్టోబర్, 2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



## • జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**టీ మీడియా ,అక్టోబర్ 9,ఖమ్మం:**

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణ అభివృద్ధి పనులపై మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ,లి నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేస్తున్న పనులను ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో నాణ్యత ను పర్యవేక్షించాలని, పనులలో లోపం కనిపిస్తే ఉపేక్షించబోమని తెలిపారు. ప్రకాశ్ నగర్, గాంధీనగర్, ద్వారకనగర్, చర్చి కాంపౌండ్ రోడ్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో పూర్తికాగా,



ఎన్ఎస్పీ క్యాంపు, కొత్త బస్టాండ్, తెలంగాణ తల్లికూడలి ప్రాంతాల్లో కొనసాగుతున్న పనుల ఫోటోలను కలెక్టర్ పరిశీలించారు. ఖమ్మం నగరం అందంగా ఉంటేనే జిల్లా అభివృద్ధి కనబడుతుందని అన్నారు. సెంటర్ డివైడర్లు, సర్కిల్ లకు రంగులు వేయాలని, ప్రమాదాల సూచికలు పెట్టాలని అన్నారు. నూతన టెక్నాలజీ తో నగరంలో గుంతలు పూడిచివేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష లో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు రంజిత్, కృష్ణలాల్ పాల్గొన్నారు.

# ఆర్‌టీఐ చట్టం ప్రభావవంతంగా అమలు

## • జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్



**టీ మీడియా ,అక్టోబర్ 9,కొత్తగూడెం:**

తెలంగాణ సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 20వ వార్షికోత్సవ వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ఆర్‌టీఐ 2025 విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఐడీఓసీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ జిల్లా అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూసమాచార హక్కు చట్టం ప్రజలకు పారదర్శక పరిపాలన అందించేందుకు కీలక సాధనం. ప్రజల అభ్యర్థనలపై సమాచారం త్వరితగతిన, సమగ్రంగా అందించాలనే దిశగా ప్రతి అధికారి కృషి చేయాలి అని అన్నారు ఆర్‌టీఐ చట్టం ద్వారా సమాచారాన్ని వేగంగా, నిష్పాక్షికంగా అందించాలనే సంకల్పంతో జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ డి ఓ సి కార్యాలయం నుంచి సిపిఓ సంజీవరావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, డి సి ఓ రుక్మిణి, ఏడి ఫిషరీస్ ఇంతియాజ్ ఖాన్, అడిషనల్ డి ఆర్ డి ఓ రవి, పౌరసరఫరాల మేనేజర్ త్రినాథ్ బాబు, భూగర్భ జలాల శాఖ అధికారి రమేష్, పరిశ్రమల శాఖ మేనేజర్ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యూట్యూబ్‌లో సెర్చ్ చేసి...ముక్కలుగా నరికి


## • ఖమ్మంలో దారుణం

**టీ మీడియా ,అక్టోబర్ 9,ఖమ్మం :**

జిల్లాలో ఇటీవల జరిగిన అత్యంత కిరాతక హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు సహా ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దర్యాప్తులో వెలుగు చూసిన సంచలన విషయాలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన గట్టా వెంకటేశ్వర్లు(38) హైదరాబాద్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. సెప్టెంబర్ 14న గ్రామంలో




మిగతా 3లో...



# సర్వీస్ నౌ సర్టిఫికేషన్స్ సాధించిన యస్‌బిఐటి విద్యార్థులు

**టిమీడియా, అక్టోబర్ 9, ఖమ్మం:**

ప్రముఖ బహుళజాతి సాఫ్ట్ వేర్ సంస్థ సర్వీస్ నౌ నిర్వహించే సర్టిఫైడ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ (సి.యస్.ఏ) పరీక్షలో తమ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అమెరికా కేంద్రంగా ఆటోమేటెడ్ బిజినెస్ వర్క్ ఫ్లో, ఐ.టి. సంబంధిత సేవలు అందిస్తున్న సర్వీస్ నౌ లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరచడం ద్వారా ప్రపంచ స్థాయి సంస్థలలో ఉద్యోగ అవకాశాలు పొందగలరని ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందించి అభినందించారు.సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ ఉద్యోగాలకు ప్రముఖంగా సర్వీస్ నౌ వారి సర్టిఫైడ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ నే అన్ని కంపెనీలు ప్రామాణికంగా పరిగణిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా? జి. ధాత్రి తెలిపారు. సాఫ్ట్ వేర్ రంగంలో గత 5 సంవత్సరాలుగా ఈ సర్టిఫికేషన్ పొందిన వారి కొరత ఉందని, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ విషయాన్ని గ్రహించి తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు.వాల్మార్ట్, అమెజాన్ తో పాటు వివిధ ఫార్ఛ్యూన్ 500 కంపెనీలు క్లయింట్ గా కలిగిన సర్వీస్ నౌ తమ కళాశాలను గుర్తించి, తమ విద్యార్థులకు సర్టిఫికేషన్ కు అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపల్ డా? జి. రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తమ విద్యార్థులకు సర్టిఫికేషన్ సాధించటంలో తోడ్పాటును అందించిన లాజిక్ వైల్ ట్రైనింగ్ సంస్థకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా? ఎ.వి.వి. శివ ప్రసాద్, డా? జె. రవీంద్రబాబు, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ డా? జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీలను మోసగించిన ప్రభుత్వం

- కోడి అమరేందర్

**టి మీడియా, అక్టోబర్ 9,పినపాక ప్రతినిధి:**



అమలు చేయలేని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన ప్రభుత్వం, తాజాగా బీసీ లను మోసగించిందని బిఆర్ఎస్ పార్టీ అశ్వాపురం మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన మండల పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీసీ లపై చిత్తశుద్ధి ఉన్నట్లు నమ్మబలికి, బీసీల ఓట్లు పొందటానికి ప్రవేశ పెట్టిన కామారెడ్డి డిక్లరేషన్ ను అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా అమలు చేయలేదన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా బీసీ ల నుండి వ్యతిరేకత వస్తుందని హడావుడిగా చట్టబద్ధత లేని జీఓ నెంబర్ 9 తెచ్చారని,ఈ జీఓ పై కొందరు కోర్టులో కేసు వేసిన సందర్భంలో 8వ తారీఖు విచారణ ఉందని తెలిసి,జీఓ చట్టబద్ధమైనది కాదని కోర్టులో వీగిపోతుందని తెలిసి కూడా ఏదో బీసీ లకు మేలుచేస్తున్నట్లు తొమ్మిదో తారీఖు ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి హడావుడి చేసిందన్నారు. బిడ్డలే సరైన విధంగా బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

# అశ్వాపురంలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**టి మీడియా, అక్టోబర్ 9,పినపాక ప్రతినిధి:**



భద్రాచలం రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐఏఎస్ గురువారం అశ్వాపురం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం మరియు ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు, హాజరు పుస్తకాలు, ప్రజా సేవల అమలు విధానాలు, సిబ్బంది హాజరు వంటి అంశాలను సమీక్షించారు. పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలందించాలంటూ అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 2025 నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎంతటి వారైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, ఎటువంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీ మరియు పర్యవేక్షణ కార్యక్రమంలో తహసిల్దార్ మణిధర్, మండల పరిషత్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.



# తిర్లాపురంలో సింగరేణి వైద్యశిబిరం

**టి మీడియా, అక్టోబర్ 9, పినపాక ప్రతినిది**

,సింగరేణి సేవా సమితి, వైద్య విభాగం ఆధ్వర్యంలో గురువారం మణుగూరు మండలంలోని తిర్లాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 134 మంది, గ్రామస్తులు పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి వైద్యురాలు డాక్టర్ సౌజన్య, స్టాఫ్ నర్స్ అనంతలక్ష్మి , సేవా సమితి కోఆర్డినేటర్ మారేశ్వరరావు, రాము, బాలు తదితరులు పాల్గొన్నారు.




# వరి విత్తనాలను వెదజల్లటం వల్ల అధిక లాభాలు

- పెస్టిసైడ్స్ ఆఫ్ ఇండియా కోఆర్డినేటర్లు

**టీ మీడియా, అక్టోబర్ 9 ,కామేపల్లి**

పొలంలో వరి విత్తనాలను నేరుగా వెదజల్లటం వల్ల రైతులు అధిక లాభాలు పొందుతారనిపెస్టిసైడ్స్ ఆఫ్ ఇండియా సంస్థ కో ఆర్డినేటర్లు హర్షదిప్ , ధరావత్ హుస్సేన్ మండల అగ్రికల్చర్ ఆఫీసర్ తారా దేవి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో గురువారం రైతులకు నేరుగా వరి వెదజల్లే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరి విత్తనాలను నేరుగా వెదజల్లే పద్ధతి ద్వారా రైతులకు నాటు ఖర్చు ఉండదని అన్నారు. నీళ్లు ఆదా అవుతాయని, దిగుబడి తొందరగా వస్తుందని పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు. ఈ విధానం రైతులకు చాలా ఉపయోగకరం అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ అధికారులు కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి

- పరిహారం పునరావాసం కల్పించాలి
- మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణి

**టీ.మీడియా,అక్టోబర్9,చింతూరు:**




దేశంలో మహిళలకు రోజు రోజుకు రక్షణ కరువైందని మహిళా రక్షణ చట్టాలను ప్రభుత్వాలు పటిష్టపరిచి అమలు చేయాలని ముంపు మండలాల్లో ప్రజలకు పరిహారం పునరావాసం నాణ్యమైన రీతిలో అందజేయాలని మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణి గురువారం ఎర్రంపేటలో జరిగిన ఐద్వా రెండవ మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడినారు. తొలిత ఐద్వా జెండాను సీనియర్ నాయకురాలు ము ర్రం రంగమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉపాధ్యక్షురాలు రమణి మాట్లాడుతూ రోజురోజుకు ఆదాని అంబానీ ఆస్తులు మాత్రం పెరిగిపోతున్నాయని దేశంలో మహిళలకు రక్షణ మాత్రం ఏమాత్రం అమలు జరగడం లేదన్నారు. దేశంలో హింసాహిత కార్యక్రమాలు. వరకట్న వేధింపులు. మహిళల ఆరోగ్యం పై ప్రభుత్వం నిర్లక్ష్యం. పౌష్టికాహార విషయంలో నిరాసక్తతతో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. మహిళలకు ప్రవేశపెట్టిన చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని. ఉద్యోగ ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. ఈ సభలో హింస, డోక్రా సమస్యలు, పోలవరం సమస్యలపై తీర్మానం చేశారు. అనంతపురంలో ఈనెల 13 14 15 తేదీల్లో రాష్ట్ర మహాసభలు నిర్వహించడం జరుగుతుందని ఉద్యమాలకు దిశ నిర్దేశం ఆ సభలో నిర్ణయించబడతాయన్నారు. ఈ సభకు మరియం దావెలి, శ్రీదేవి నాయకురాలు పాల్గొంటారని తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా మడివి శ్రీదేవి. జిల్లా కార్యదర్శిగా ఐ పద్మావతి లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బప్పెన కిరణ్ . సిఐటియు ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్. వి ఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి. మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్. రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



# వృత్తి శిక్షణ అధ్యాపకుల దరఖాస్తులు ఆహ్వానం

**టి మీడియా, అక్టోబర్ 9, పినపాక ప్రతినిధి:**

సింగరేణి మణుగూరు ఏరియాలోని సింగరేణియులకు, స్థానికులకు, సింగరేణి పరిధిలోని నిరుద్యోగ యువతకు టైలరింగ్, కంప్యూటర్ డిటిపి, స్పోకెన్ ఇంగ్లీష్, క్లాత్/ జ్యూట్ బంజారా బ్యాగ్స్, ఫోటోషాప్, మల్టీమీడియా కోర్సులలో తగిన పారితోషికం పై శిక్షణ ఇచ్చేందుకు అనుభవం, అర్హత, ఆసక్తిగల అధ్యాపకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిఎం దుర్గం రామచందర్ తెలిపారు. అధ్యాపకులు తమ పూర్తి వివరాలతో కూడిన బయోడేటా ను ఈ నెల 15వ తారీఖు లోగా జిఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో అందజేయాలని డీజిఎం ( పర్సనల్) అధికార ప్రతినిధి ఎస్ రమేష్ తెలిపారు.



# సీసీఐ కేంద్రాలతోనే రైతుకు మద్దతు ధర

- రైతులకు అవగాహన సదస్సులో ఏఎంసీ కార్యదర్శి ఈ.నరేష్‌కుమార్

**టీ మీడియా, అక్టోబర్ 09, సింగరేణి (కారేపల్లి):**

రైతులు తమ పత్తి ని సీసీఐ కేంద్రాలలోనే అమ్మకాలు చేసుకోవాలని ఇల్లందు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఈ నరేష్‌కుమార్ అన్నారు. గురువారం కారేపల్లి మండలంలో సీసీఐ పత్తి కొనుగోళ్లపై రైతులకు అవగాహణ కల్పించారు. కారేపల్లి క్రాస్‌రోడ్, కారేపల్లిలో జరిగిన సదస్సులో ఏఎంసీ కార్యదర్శి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పత్తి క్వింటాకు రూ. 8110 ధర ప్రకటించిందన్నారు. మద్దతు ధర పొందాలంటే రైతులు తప్పని సరిగా సీసీఐ కేంద్రాలలో పత్తి విక్రయించాలన్నారు. పత్తి కొనుగోళ్లలో అక్రమాలను నివారించటానికి సీసీఐ మోబైల్ యాప్ తీసుకవచ్చిందని తెలిపారు. పత్తి అమ్ముకునే రాతులు ఈ యాఫ్‌లో స్లాట్ బుక్ చేసుకోవల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా సీసీఐ కేంద్రాల వద్ద రైతుల రద్ధి ని నియంత్రించ వచ్చున్నారు. నాణ్యమైన పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకవచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్.శ్రీనివాసరావు, సిబ్బంది రంజిత్, మున్నేరు, మధు, రవి, రైతులు పాల్గొన్నారు.



# యువతలో ఉన్మాదాన్ని ఎక్కిస్తున్న బీజేపీ

- కారేపల్లిలో చేగువేరా వర్ధంతి

**టీ మీడియా, అక్టోబర్ 09, సింగరేణి (కారేపల్లి) :**
దేశంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాని నుండి వ్యతిరేకత లేకుండా చేసుకునే పనిలో యువతలో ఉన్మాద బావాజాలాన్ని ఎక్కించే ప్రయత్నం చేస్తుందని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆదెర్ల వినయ్‌కుమార్ విమర్శించారు. గురువారం కారేపల్లిలో చేగువేరా వర్ధంతిని నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు. ఈసందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ చేగువేరా జీవితాంతం సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. సామ్ర్యావాదంతో ముప్పుపై యువతను చైతన్యం చేసి యూత్ ఐకాన్‌గా మారారన్నారు. ప్రజాస్వామ్య భారత దేశంలో రాజ్యాంగాన్ని రక్షించే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయిపై సనాతన ధర్మం పేరుతో మతోన్మాద మూకలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన బిజెపి ఉన్మాద భావజాల ఫలితమేనన్నారు. దీనిని ప్రజాస్వామ్య వాదులు ఖండిరచాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు గడ్డం దిలీప్ కుమార్, యర్నాగి సంపత్ ,సలీం, చిలుముల కమలాకర్, అదెర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్ఐగా పోలిశెట్టి శ్రీకాంత్

**టీ మీడియా ,అక్టోబర్ 9, కామేపల్లి:**
కామేపల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా పోలిశెట్టి శ్రీకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన ఎస్ఐ సాయికుమార్ చేతుల మీదుగా శ్రీకాంత్ బాధ్యతలు అందుకున్నారు. బదిలీ అయిన సందర్భంగా సాయికుమార్కు కామేపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కారం చేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతలను కాపాడే విధంగా కృషి చేస్తానని తెలిపారు.




# యూట్యూబ్‌లో సెర్చ్ చేసి...ముక్కలుగా నరికి

(మొదటిపేజీ తరువాయి...)

జరిగిన ఒక శుభకార్యంలో పాల్గొని సెప్టెంబర్ 15న హైదరాబాద్‌కు తిరిగి వెళుతున్నానని తన బావకు చెప్పి బయలుదేరారు. ఆ తర్వాత మూడు రోజుల వరకు వెంకటేశ్వర్లు నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడం, ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చిన బావ యాదగిరి సెప్టెంబర్ 22న కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వెలుగులోకి దారుణ హత్య

దర్యాప్తులో వెంకటేశ్వర్లు బ్యాంకు ఖాతా నుంచి డిజిటల్ లావాదేవీలు జరుగుతుండటాన్ని పోలీసులు గుర్తించారు. ఈ ఆధారాల ద్వారా అశోక్ అనే ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, దారుణమైన నిజాలు వెలుగులోకి వచ్చాయి. హత్యకు గురైన వెంకటేశ్వర్లుకు, ప్రధాన నిందితుడు అశోక్‌కు ఖమ్మంలోని లైబ్రరీలో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారు తరచూ కలుసుకునేవారు. వెంకటేశ్వర్లు వద్ద ఉన్న నగదు కోసమే అశోక్ ఈ హత్యకు ప్లాన్ చేశాడు. హత్యకు ముందు, మృతదేహాన్ని ఎలా ముక్కలుగా నరకాలి, ఆ తర్వాత ఆనవాళ్లు లేకుండా ఎలా పడేయాలి అనే విషయాల గురించి అశోక్ యూట్యూబ్‌లో సెర్చ్ చేసి, పూర్తిగా ప్లాన్ చేసుకున్నట్టు విచారణలో తేలింది. సెప్టెంబర్ 16న వెంకటేశ్వర్లును తన రూమ్‌కు పిలిపించిన అశోక్.. అతను నిద్రిస్తున్న సమయంలో అతి కిరాతకంగా కత్తితో ముక్కలుగా నరికి హత్య చేశాడు. ఆ తర్వాత శరీరం భాగాలను బైక్‌పై తీసుకొచ్చి ఖమ్మం శివారు ప్రాంతాల్లో పడేశాడు. ఈ హత్య కేసులో అశోక్‌కు సహకరించిన నగ్మా, కృష్ణయ్య అనే మరో ఇద్దరు నిందితులను కూడా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి హత్యకు ఉపయోగించిన కత్తులు, ఫోన్లు, అలాగే వెంకటేశ్వర్లుకు చెందిన గోల్డ్ చైన్, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కిరాతక హత్య స్థానికంగా భయాందోళనలు సృష్టిస్తోంది.

# బీసీలకు మళ్ళీ అన్యాయమే : ఆర్జేసి కృష్ణ

**టిమీడియా, అక్టోబర్ 9, ఖమ్మం**
బీసీలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించటం తో బీసీ కులస్తులకు మళ్ళీ అన్యాయమే జరిగినట్లయ్యిందని దీనికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం ఆర్జే సి కళాశాలలో ఏర్పాటు చేసిన బీసీ కుల సంఘాల ముఖ్య నాయకుల సమావేశం లో ఆయన మాట్లాడారు. బీసీలకు 42% శాతం రిజర్వేషన్ ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని



ఆరోపించారు. ఉభయ సభల్లో ను బిల్లు ఆమోదం పొందాక ఇలా జరగడం అగ్ర వర్ణాల ఆధిపత్యాన్ని చూపుతుందన్నారు. చీకట్లో గొంగడి కప్పుకొని చాటు%శీ%గా రిజర్వేషన్ ఇవ్వొచ్చా లేదా అని ప్రభుత్వం చూస్తుందాని మండి పడ్డారు. జనాభా దామాషా ప్రకారం హక్కుగా రావాల్సిన రిజర్వేషన్లను అడ్డుకోవాలని హై కోర్టులో, సుప్రీంకోర్టులో కేసు వేశారని ఆరోపించారు. ఏది ఏమైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. లేనియెడల ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కురాకుల నాగభూషణం, బొమ్మా రాజేశ్వర రావు, కత్తి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

# చిట్టి అమౌంట్ చెల్లించనందుకు జైలు శిక్ష

**టీ మీడియా ,అక్టోబర్ 9,కొత్తగూడెం లీగల్ :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ప్రైవేటు చిట్టి లు నడిపి మోసం చేసిన వ్యక్తికి ఐదు సంవత్సరముల కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా కొత్తగూడెం బస్తి చెందిన ఎండి. నిజాముద్దీన్ స్థానికంగా గంగాభిషన్న భస్టికి చెందిన జక్కుల వెంకన్న తన కుటుంబంతో గత కొన్ని సంవత్సరంల నుండి నివాసం ఉన్నందున పరిచయాలు బాగా పెరిగినందున మనిషికి రూ.ఒక లక్ష, రూ .ఒకటిన్నర లక్ష విలువగల చిట్లి లు నిర్వహించాడు తనతో పాటు ఎల్.సుధ,పరపతి ,లక్ష్మణ్ రెడ్డి, పేరం నరేష్ , కోలా, సాల్మన్ రాజు, పరపతి వీరబాబు, మణమ్మ ,పెరుమాళ్ళు నాగేశ్వరరావు మరికొందరు మొత్తం 20 మంది కలిసి అతని వద్ద చిట్టీలు వేయించుకొని ఎటువంటి బాకీలు లేకుండా చెల్లించినప్పటికిని మొత్తం రూ.16, 41,000/- చెల్లించకుండా మోసం చేసి పారిపోయాడని కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో 2017 నవంబర్ 25న అప్పటి ఎస్ ఐ. జి.తిరుపతికి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసుకోగా అప్పటి ఇన్స్పెక్టర్ కే. కుమారస్వామి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. కోర్టులో 22 మంది సాక్షుల విచారణ అనంతరం జక్కుల వెంకన్న పై నేరం ఋజువు కాగా సెక్షన్ 420 ఐ.పి.సి. ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష , రూ.3,000/- ల జరిమానా, సెక్షన్ 5 తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్,1999 ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన కారగార శిక్ష మరియు రూ .3000/- ల జరిమానా మొత్తం 6000 జరిమానా చెల్లించాల్సిందిగా తీర్పు చెప్పారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించ వలెనని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిడి లక్ష్మి నిర్వహించారు .కోర్టు నోడల్ ఆఫీసర్ ఎస్.ఐ. ఆర్. ప్రభాకర్, కోర్టు లైజాన్ ఆఫీసర్ నేరేడు వీరబాబు (కోర్టు డ్యూటీ ఆఫీసర్) పిసి కె.వీరన్న లు సహకరించారు.




# ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు వితరణ

**టీ మీడియా ,అక్టోబర్ 9,చుంచుపల్లి :**
కొత్తగూడెం, రామాంజనేయ కాలనీ ప్రభుత్వ మండల ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేల విలువైన 15 కుర్చీలు, 50 మంది విద్యార్థులు కూర్చోవడానికి వీలుగా ఫ్లోర్ మ్యాట్లు విద్యానగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీ నిత్య జన్మదినం సందర్భంగా గురువారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ పాఠశాలకు సభ్యుడు సీతారామ శాస్త్రి గారి ద్వారా అనేక కార్యక్రమాలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయ కాలనీ మాజీ సర్పంచ్ జ్ఞానమూర్తి, ప్రధానోపాధ్యాయుడు జగ్గుదాస్, టీచర్ సునీత, సభ్యులు రాజేంద్రప్రసాద్, విజయ మోహన్, మైనేని నాగేశ్వరరావు, అంజనానందం, ఎస్.రామచంద్రరావు, నసీరుల్లా, సోందుబాబు పాల్గొన్నారు



# చికెన్ తిని ఆరుగురికి అస్వస్థత

**టీ మీడియా ,అక్టోబర్ 9,పెన్‌పహాడ్ :**
చికెన్ తిని ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన పెన్‌పహాడ్ మండలం దూపాడు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు కత్తి ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గడిచిన శనివారం తన మనవడి 21వ రోజు వేడుక సందర్భంగా పెన్‌పహాడ్‌లోని క్వాలిటీ చికెన్ సెంటర్ వద్ద 6 కేజీల చికెన్ తీసుకుని వెళ్లాడు. భోజనం అనంతరం గంట తర్వాత కుటుంబ సభ్యులకు స్వల్పంగా వాంతులయ్యాయి. మామూలు వాంతులే అని పట్టించుకోలేదు. కాగా తెల్లవారుజాము నుండి విపరీతంగా వాంతులు, విరోచనాలు కాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ముగ్గురు, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఇద్దరు చిన్నారులను, మరో ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ మహిళను అడ్మిట్ చేశారు. డాక్టర్లు ఇచ్చిన రిపోర్టు ప్రకారం చికెన్ తినడం వల్లే అస్వస్థతకు గురైనట్లు బాధితుడు తెలిపాడు. చికెన్ సెంటర్ నిర్వాహకుడిని ప్రశ్నించగా నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నట్లు వెల్లడించాడు. క్వాలిటీ చికెన్ సెంటర్‌పై అధికారులు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను రక్షించాలని ఈ సందర్భంగా ఉపేందర్ పేర్కొన్నాడు.



# ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

**టీ మీడియా ,అక్టోబర్ 9,నల్లగొండ :**
నల్లగొండ జిల్లా చిట్యాల మండల తహసీల్దార్ కృష్ణ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గుండ్రంపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూమికి సంబంధించన మ్యూటేషన్ కోసం రూ.2లక్షలు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. తహసీల్ కార్యాలయంలో వ్యూహం ప్రకారం మాటువేసిన ఏసీబీ అధికారులు గురువారం తహసీల్దార్ గుగులోత్ కృష్ణా , మరో ప్రైవేట్ వ్యక్తి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకుని నాంబర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ సిబ్బంది లంచాలకు పాల్పడితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.